క్లుప్తంగా

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



బోరు పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ రామారావు

డుంబ్రిగుడ: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యల్లో భాగంగా లైగండ గ్రామంలో ఆదివారం బోరు వేయించారు. ఎంపీటీసీ నిధులు కేటాయించి బోరును ఏర్పాటు చేసినట్టు ఎంపీటీసీ సభ్యుడు రామారావు చెప్పారు. రానున్న వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తుగా బోరు ఏర్పాటు చేశామన్నారు. వార్డు సభ్యులు మల్లేశ్వరరావు, వలంటీర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు



జోలాపుట్టు వారపు సంతలో దళారులతో మాట్లాడుతున్న లైజన్ వర్కర్లు

ముంచంగిపుట్టు:గిరిజన మిరియాల రైతులను వారపు సంతల్లో దళారులు మోసం చేయరాదని మండల కాఫీ లైజన్ వర్కర్స్ దళారులకు హెచ్చరించారు. మండలంలోని జోలాపుట్టు వారపు సంతలో ఆదివారం కాఫీ లైజన్ వర్కర్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు దళారులు ఏర్పాటు చేసి ఉత్పత్తుల కొనుగోలు కాటాలను పరిశీలించారు. మిరియాలను రూ.500 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేయాలని, తుకాల్లో మోసాలు చేయవద్దని, మిరియాల కొనుగోలులో ఎటువంటి తేడాలు చేసినా కఠిన చర్యలు తప్పవని, ధరల పట్టిక సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. లైజన్ వర్కర్స్ నర్సింగ్, చంద్రుబాబు, రామ్మూర్తి, హరికృష్ణ, లైకోన్, శంకర్ రావు, రామచందర్, గోపాల్‌లున్నారు.

జెడ్పీ పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం

గంగవరం: గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తగిన చర్యలు చేపడతామని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు హామీ ఇచ్చినట్టు జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం తెలిపారు. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలో మండలానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించినట్టు ఆమె చెప్పారు. ఇందులో భాగంగా ప్రధానంగా జిల్లా పరిషత్ హైస్కూలు భవనాలు నిర్మించాలని, క్రీడా మైదానం అభివృద్ధి చేయాలని సభ దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఆమె తెలిపారు. దీనిపై జిల్లా పరిషత్ చైర్మన్ వేణుగోపాలరావు సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

మాడిపోతున్న జీడిపూత.. ఆందోళనలో రైతులు



మాడిపోతున్న జీడిపూత

కొయ్యూరు: పొగమంచు కురవడంతో జీడిపూత మాడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నా రు. మండలంలో ఎక్కువ మంది రైతులు జీడితోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. గతేడాది వాతావరణం ప్రతికూలంగా మారడంతో రైతులు నష్టపోయారు. ఇప్పుడు అదే పరిస్థితి కావడంతో ఆందోళన అధికమైంది. పంటను కాపాడేందుకు అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

10న కాంగ్రెస్ సభ

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ఈనెల 10 కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు తెలిపారు. సభకు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు.

నాడు తిరోగమనం.. నేడు పురోగమనం

ఒకప్పుడు దీనిని చీకటి పంచాయతీగా పిలిచేవారు. 36 గ్రామాల్లో తాగేందుకు నీరు లేక నడిచేందుకు రహదారులు లేక, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని భయంతో గిరిజనులు ఉండేవారు..రెండు దశాబ్దాల క్రితం వరకు బూదరాళ్ల పంచాయతీ మావోయిస్టులకు అడ్డాగా ఉండేది...అదంతా గతం ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పరిస్థితి మారింది. అన్ని గ్రామాల్లో తాగునీటి సదుపాయం వచ్చింది. తొమ్మిది గ్రామాల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేశారు.రహదారులు వచ్చాయి. శివారు గ్రామాలకూ అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించే అవకాశం కలిగింది. ఈ నాలుగున్నర సంవత్సరాల్లో రహదారులు మెరుగుపడడంతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థ వృద్ధి చెందింది.పంచాయతీలో అభివృద్ధి దిశగా పయనిస్తోంది.

- అష్టకష్టాల నుంచి అభివృద్ధి వైపు
- నాలుగున్నరేళ్లలో వికసిత్ బూదరాళ్ల
- నాడు మావోయిస్టుల అలజడులు..నేడు ప్రశాంతం
- మారిన గ్రామాల రూపురేఖలు



వంతమర్రిలో జెడ్పీచైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిను సన్మానిస్తున్న గ్రామస్తులు(ఫైల్)



మండలం: కొయ్యూరు

పంచాయతీలు:	33
గ్రామాలు	318
జనాభా	52,400
ఓటర్లు	39,000
సచివాలయాలు:	23
ఆర్‌బీకేలు:	23
పీహెచ్‌సీలు :	4



బూదరాళ్లలో ఏర్పాటు చేసిన సెల్ టవర్



బూదరాళ్లలో సచివాలయ భవనం

బూదరాళ్ల పంచాయతీ సమాచారం

గ్రామాలు	36
జనాభా	5120
ఓటర్లు	3890
ఏర్పాటు చేసిన టవర్లు	9
పది గ్రామాలకు విద్యుతీకరణ	
ఇంటింటికి కొళాయి ఉన్న గ్రామాలు:	11

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే రహదారి లేదు. పంచాయతీకి వెళ్లాలంటే భయం..భయం..మావోయిస్టులకు అడ్డాగా ఉండేది.. 1999-2004 అసెంబ్లీ ఎన్నికల్లో మావోయిస్టులు పోలింగ్ బాక్స్‌లను సైతం ఎత్తుకుపోయారు. 1992లో అప్పటి చింతపల్లి ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజును మావోయిస్టులు కిడ్నాప్ చేసినప్పుడు నెల రోజుల పాటు బీబీసీలో బూదరాళ్ల పేరు వినిపించింది. అలాంటి పంచాయతీలో ఇప్పుడు అలజడి తగ్గింది. గిరియువత ఆలోచన ధోరణి మారింది...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీలో అన్ని ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా బూదరాళ్లలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరిగాయి. ఈ నాలుగున్నరేళ్లలో శివారు గ్రామాలకు సైతం ప్రభుత్వం రహదారుల సౌకర్యం, తాగునీటి సరఫరా, ఇతరత్రా పనులు చేపట్టింది. ఫలితంగా పంచాయతీలో గ్రామాలు అభివృద్ధి చెందాయి. మొదట బూదరాళ్లకు బీటీ రోడ్డును వేశారు. దీని తరువాత చాపరాతిపాలెం రహదారిని బూదరాళ్ల మీదుగా వేశారు. దీంతో చింతపల్లి కొయ్యూరు నుంచి 50 నిమిషాల్లో వెళ్లగలుగుతున్నారు.

రూపుమారిన బూదరాళ్ల

బూదరాళ్ల పంచాయతీ కేంద్రం రూపు మారింది.తాజాగా గ్రామంలో సచివాలయ భవనాన్ని నిర్మించారు. సీసీ రోడ్డును వేశారు. ఇక చింతపల్లికి రాకపోకలు పెరగడంతో బూదరాళ్లకు వాహనాల తాకిడి పెరిగింది. కలెక్టర్ స్థాయి అధికారులు కూడా ఈ దారిలోనే ప్రయాణం చేస్తున్నారు. బూదరాళ్ల, బాలరేవుల, చీడిపల్లి, ముకుడుపల్లి, గరిమండ, బి.కొత్తూరుతో కలిపి తొమ్మిది టవర్లను ఏర్పాటు చేశారు. బూదరాళ్లలో సచివాలయ భవనం ఏర్పాటు చేశారు. బాలరేవుల నుంచి కునుకూరు, గరిమండ నుంచి నల్లబిల్లి, కునుకూరు నుంచి చీడిపల్లి, పోకలపాలెం, దొడ్డవరం మీదుగా మరో ఐదు గ్రామాలకు రహదారిని వేశారు. టవర్లు, రోడ్లు రావడంతో ఎవరికి అత్యవసరమైనా వెంటనే 108కి సమాచారం ఇస్తున్నారు. ఫలితంగా ప్రాణాపాయం తప్పుతుంది. పంచాయతీలో సుమారు 12 గ్రామాలకు తారురోడ్లు, ఎనిమిదికి పైగా గ్రామాలకు మెటల్‌రోడ్లు ఉన్నాయి. రవాణా సౌకర్యం మెరుగుపడింది. గిరిజన రైతులు తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఏళ్ల నాటి అభివృద్ధి కల సాకారమవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

అభివృద్ధి కల సాకారం



ఒకప్పుడు రహదారి లేక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు రహదారి రావడంతో పాటు చింతపల్లికి ఈ దారిలోనే వెళ్తున్నాం. సచివాలయ భవనం, సెల్ టవర్ ఏర్పాటు చేశారు. సమాచార వ్యవస్థ బాగుంది. ఏళ్ల నాటి అభివృద్ధి కల సాకారమైంది. చాలా ఆనందంగా ఉంది.

- ఎం.రమణమ్మ, బూదరాళ్ల

రూపురేఖలు మారాయి



జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గ్రామాల రూపు రేఖలు మారాయి.మా గ్రామానికి గతంలో రోడ్డు లేదు. ఇప్పుడు వచ్చింది.అదే విధంగా టవర్లు లేవు. ఒకప్పుడు దేనికోసమైనా నడిచి వెళ్లడం ఇబ్బందిగా ఉండేది.ఇప్పుడు రవాణా సౌకర్యం ఉంది. మౌలిక సదుపాయాలు కలిగాయి.

- ఎస్.బంగారమ్మ, బూదరాళ్ల

సమస్యల పరిష్కారం



పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కారంకు కృషి చేస్తున్నాము.పీఎం జన్‌మన్‌లో బాగంగా ఆదివాసీ గ్రామాలకు ప్రత్యేక సదుపాయలు కల్పిస్తున్నాం.మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.జల్ జీవన్ మిషన్‌లో అనేక గ్రామాలకు ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేశాం.

- లాలం సీతయ్య, ఎంపీడీవో

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు



అప్పలరాజుపేటలో ఇంటి పనులను పరిశీలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండలానికి జన్‌మన్ పథకం కింద 525 శాశ్వత గృహాలు కొత్తగా మంజూరయ్యాయని, వాటి నిర్మాణాలు వేగవంతానికి కృషి చేస్తున్నామని హౌసింగ్ ఏఈ కే. వెంకట్రాజు అన్నారు. అప్పలరాజుపేట గ్రామంలో ఓ ఆదివాసీ కుటుంబం చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. కొత్తగా మంజూరైన ఇళ్లల్లో ఇప్పటి వరకు 20 ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద ప్రతి ఇంటికి యూనిట్ కాస్ట్ రూ.2.39 లక్షలు కాగా పనులు మొదలుపెట్టిన వెంటనే ఒకేసారి తొలివిడత బిల్లుగా రూ.70వేలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గోడలు (లింటల్ లెవెల్) పూర్తి కాగానే రూ. 90,000, శ్లాబ్ పూర్తి అయితే రూ. 40,000 లబ్ధిదారుకు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఇళ్లు నిర్మించుకొనే కుటుంబానికి ఉపాధి హామీ ద్వారా అందజేసే రూ.27వేలు (మూడు నెలల రోజు వారీ వేతనాలు) టాయ్‌లెట్ నిర్మాణానికి ఇస్తున్న మరో రూ.12వేలు యూనిట్ కాస్టలో కలసి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని, త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఆయన అవగాహన కల్పించారు. ర్కఇనస్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మంగమ్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత పసుపులేటి బాలరాజు తదితరులు

పాడేరు/అనంతగిరి: ఇటీవల మృతి చెందిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు మాతృమూర్తి మంగమ్మకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పసుపులేటి బాలరాజు సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు విశాఖపట్నంలోని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, వడిత్యా శంకర్‌నాయక్ తదితరులున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు



రంగలోయ-సాకిరేవు తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ వరహాలమ్మ, నేతలు



మొంజాపుట్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల, నేతలు

పెదబయలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో రోడ్డు సదుపాయం కల్పించినట్టు ఎంపీపీ బొండా వరహాలమ్మ అన్నారు.ఆదివారం మండలంలోని పోయిపల్లి పంచాయతీ రంగలోయ నుంచి జంక్షన్ నుంచి సాకిరేవు వరకు రూ.3.9 కోట్లతో 3.7 కిలోమీటర్ల తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులకు ప్రారంబించారు. గిరిజన ప్రాంతంలో అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గత ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించందని, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నేడు జగనన్న పాలనలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటుగా కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపర్చే లక్ష్యంగా సెల్ టవర్ల ఏర్పాటు, ప్రభుత్వ బడులు నాడు-నేడు ద్వారా రూపరేఖల మార్పు, ఇంగ్లిస్ మీడియం చదువులు, నవరత్నాల ద్వారా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఎన్నడూ చూడని అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలో నేడు గ్రామాల్లో కనిపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో మరల జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని కోరారు. పోయిపల్లి సర్పంచ్ బొండా చిట్టి, ఎంపీటీసీ పూర్ణారావు, నాయకులు బొండా అప్పలరాజు, భాస్కరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ డి.నీలకంఠం, ఎంపీటీసీ బి.కమలలు అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ మొంజాపుట్టు గ్రామంలో ఎంపీపీ నిధులు రూ.5లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి రహదారి, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను ప్రభుత్వం మెరుగుపరుస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుమూల గిరిజనులు రవాణా కష్టాలు పడ్డారని జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత గ్రామాల్లో రహదారి సమస్యలు లేకుండా చూడాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఉప సర్పంచ్ రామచందర్, నేతలు జయదేవ్, భగత్‌రామ్, కామేష్, భగవాన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

8న విద్యార్థులకు ప్రతిభ పోటీలు

ఎటపాక: మండలంలోని అన్ని జిల్లా పరిషత్, ఆశ్రమ, కేజీబీవి పాఠశాలల విద్యార్థులకు హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8న ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్, రవి తెలిపారు. గొరిదేవిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి అదే రోజు బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఆహ్వానం అందిన ప్రతీ పాఠశాల నుంచి తమ విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. వ్యాస రచన, డిబేట్, క్విజ్, దేశభక్తి పాటల పోటీలు ఉంటాయని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత చింతూరు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చింతూరు, చొప్పల్లి జట్ల జరుగుతున్న మ్యాచ్

చింతూరు: స్థానికంగా యాభై రోజుల పాటు నిర్వహించిన సకీనా మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో చింతూరు జట్టు విజేతగా నిలిచింది. చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన 80 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంటు ఫైనల్ ఆదివారం చింతూరు, చొప్పల్లి జట్ల మధ్య జరిగింది. ఫైనల్ పోరులో ముందుగా బ్యాటింగ్ చేసిన చింతూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 85 పరుగులకు ఆలౌటైంది. 86 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన చొప్పల్లి జట్టు 11 ఓవర్లలో కేవలం 55 పరుగులకే ఆలౌట్ కావడంతో చింతూరు జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతలకు చింతూరు సీఐ గజేంద్రకుమార్, పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడల్లో రాణించడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని, గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. యువత వ్యసనాల వైపు పయనించకుండా క్రీడలపై దృష్టి సారించడం ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చని, ప్రతిభను గ్రామస్థాయిలోనే కాకుండా పట్టణ ప్రాంతాలకు కూడా వ్యాపించేలా కష్టపడాలని వారు సూచించారు. విన్నర్స్‌గా నిలిచిన చింతూరు జట్టుకు రూ.50 వేల నగదు, కప్, రన్నరప్‌గా నిలిచిన చొప్పల్లి జట్టుకు రూ.25 వేల నగదు, కప్‌ను, మూడో స్థానంలో నిలిచిన రామవరం జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన కూటూరు జట్టుకు రూ.5 వేలను వారు అందజేశారు. టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా చింతూరుకు చెందిన దుర్గాప్రసాద్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా చొప్పల్లికి చెందిన గౌతమ్, బెస్ట్ బౌలర్‌గా పవన్ నిలిచారు. ఎంపీటీసీ సభ్యుడు వేకా రాజ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్‌అలీ, సోడె మురళి, కణితి గణేష్, జిక్రియా, ప్రవీణ్, దుర్గారావు, మురళీ, నిర్వాహకులు అయ్యూబ్‌అలీ, అన్వర్‌అలీ, హసన్‌అలీ, యూత్ సభ్యులు ప్రదీప్, రియాజ్, సూరి, హరి పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు



నెల్లిమెట్ల వద్ద శిథిలస్థితికి చేరుకున్న లోలెవెల్ కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

రాజవొమ్మంగి: మండలంలోని నెల్లిమెట్ల వద్ద చిన్నేరుపై ప్రమాదకరంగా మారిన లోలెవెల్ చప్టా స్థానే త్వరలోనే పైప్ కల్వర్ట్ నిర్మించేందుకు చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఆయన ఆదివారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, అనంతబాబు కింద్ర గ్రామంలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా మార్గ మధ్యలో చిన్నేరుపై గల కల్వర్టుపై తరచు జరుగుతున్న ప్రమాదాలను స్థానికులు వారి దృష్టికి తీసుకొని వచ్చారు. దీనితో వారు కారు దిగి పరిస్థితిని సమీక్షించారు. రాజవొమ్మంగి మీదుగా ఐ.పోలవరం నుంచి కాకరపాడు వరకు ఎన్‌హెచ్ 516ఈ (రహదారి) పనులు జరుగుతున్న నేపథ్యంలో భారీ వాహనాలు గ్రావెల్, ఇతర మెటీరియల్స్‌తో ఈ కల్వర్టుపై నుంచి వెళ్తున్నాయని, దీంతో అంతంత మాత్రంగా ఉన్న చిన్నేరుపై గల లోలెవెల్ కల్వర్ట్ మరింత శిథిలస్థితికి చేరుకుందని స్థానికులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వివరించారు. దీంతో వారు స్పందించి, ఎన్‌హెచ్516ఈ పనులు చేపడుతున్న సంస్థ ప్రతినిధులను పిలిపించి మాట్లాడారు. ప్రమాదాలు నివారించేందుకు ఈ వాగు వద్ద కల్వర్ట్ నిర్మించాలని కోరారు. సంబంధిత కాంట్రాక్టర్ సానుకూలంగా స్పందించడంతో త్వరలోనే కల్వర్టు పునఃనిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు స్థానికులకు చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ తదితరులు, కార్యకర్తలున్నారు.


250 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి వైద్య సేవలందించినట్టు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ రాజ్ తెలిపారు. డాక్టర్లు దాసరి ఉమా మహేష్, తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్ వైద్య సేవలు అందించినట్టు చెప్పారు. శిబిరంలో సుమారు 60 మందికి రక్తపరీక్షలు, 11మందికి థైరాయిడ్ పరీక్షలు, 19మందికి ఎక్స్‌రేలు, 13.మందికి ఫిజియథెరపీ సేవలందించినట్టు స్వామీజీ తెలిపారు. పరమహంస యోగానంద నేత్రాలయం(వేమగిరి) ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 53 మందికి కంటి పరీక్షలు చేసి 13 మందికి కళ్లద్దాలు అందజేశారు. కంటి ఆపరేషన్ నిమిత్తం 11మందిని వేమగిరి యోగానంద నేత్రాలయానికి తరలించినట్టు చెప్పారు.రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో క్యాంప్ కో - ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎస్.చంటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

శిథిలావస్థలో వంతెన



ప్రమాదకరంగా తీగలవలస వంతెన

హుకుంపేట: మండలంలోని ఆంధ్రా-ఒడిశా ప్రాంత సరిహద్దు ప్రాంతం కామయ్యపేట ప్రధాన రహదారిలో ఉన్న తీగలవలస వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదస్థాయిలో ఉంది. వంతెన కిందభాగం పునాదులు పూర్తిగా కూలిపోయి ప్రమాదస్థాయిలో ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఈ వంతెన మీదుగా ప్రయాణానికి ఏ క్షణం ఏమి జరుగుతుందోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఆంధ్రా-ఒడిశా సరి హద్దు గ్రామాలకే కాకుండా పెదబయలు, డుంబ్రిగుడ మండల ప్రాంతాలకు ఈ మార్గం దగ్గర కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయని, అలాంటి ప్రధానమైన ఈ రహదారిలో ఉన్న వంతెన ఉందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, వాహనచోదకులు కోరుతున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా రాత్రిపూట స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జోలాపుట్టు, కుమడ, డుడుమ మార్గాల నుంచి వచ్చే వాహనదారుల వివరాలు సేకరించి, రాకపోకలపై ఆరా తీస్తున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేశామని, ఎటువంటి గుర్తింపు కార్డులు లేని వ్యక్తుల విచారించి విడిచిపెడుతున్నామన్నారు. తనిఖీల్లో పోలీసులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ తీర్థం

యలమంచిలి రూరల్ : రామారాయుడుపాలెంలో ఆదివారం ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ పెద్ద వెంకట గిరి దంపతులతో పాటు పలువురు భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం, సిందూరార్చన చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.